క్లుప్తంగా

24 మద్యం సీసాలు స్వాధీనం

నాగాయలంక: మద్యం అక్రమంగా తరలిస్తున్న మండలంలోని సొర్లగొంది గ్రామానికి చెందిన కొప్పనాతి వెంకటేశ్వరరావును నాగాయలంకలో పట్టుకుని అతని నుంచి 24 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్ గురువారం చెప్పారు. అక్రమంగా మద్యం సీసాలు తీసుకెళ్లి అతని ఇంటి వద్ద అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి.. ఎలాంటి లైసెన్స్ లేకుండా మద్యం బాటిల్స్ కలిగి ఉండటంతో వెంకటేశ్వరరావును పట్టుకున్నామని చెప్పారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణ జరిగిన తర్వాత గ్రామంలో చట్ట విరుద్ధంగా మద్యం అమ్ముతున్నట్లు అతను అంగీకరించగా మద్యం బాటిళ్లతో స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి విజయవాడ వాస్తవ్యులు పర్వతనేని వెంకట శివకోటేశ్వరావు, లక్ష్మీరాణి దంపతులు గురువారం రూ. 50,001 విరాళంగా అందజేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు కిషోర్, రమావాణికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

గుంటూరు రాస్తా పనులకు నేడు శంకుస్థాపన

గూడూరు: తరకటూరులోని గుంటూరు రాస్తా నిర్మాణ పనులకు శుక్రవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. గుంటూరు రాస్తా నిర్మించాలని తరకటూరు రైతులు కొన్నేళ్లుగా కోరుతూ వస్తున్నారు. దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చిన జోగి రమేష్ మంత్రిగా చేసిన కాలంలో డీఎంఎఫ్ నిధుల నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేయించారు. టెండర్ పద్ధతిలో కిలోమీటర్ మేర జీఎస్బీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ జరుగుతుండగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికలు అయిపోయిన తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గుంటూరు రాస్తా పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజావేదిక

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తైన సందర్భంగా తరకటూరులో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు.

ఆరోగ్యకర సమాజానికి పౌష్టికాహారం

బంటుమిల్లి: భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకుని తల్లిబిడ్డ సంతోషంగా ఉండాలని బంటుమిల్లి పీహెచ్‌సీ సూపర్వైజర్ శ్రీనివాస్ అన్నారు. అర్తమూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలింతలు, గర్భిణులు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారాన్ని వివరించారు.

హంసలదీవిలో దోమల నివారణకు చర్యలు



కోడూరు: మండలంలోని హంసలదీవి పంచాయతీలో దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ చేయించారు. హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లోని ప్రతి వీధిలో ప్రత్యేక ఆటోలో ఫాగింగ్ మిషన్‌ను అమర్చి పొగ పెట్టారు. సముద్రతీర ప్రాంతం కావడంతో దోమల అధికంగా ఉన్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి లీలా ప్రియాంక, ఉల్లిపాలెం సచివాలయ డీఏ శంకర్, సిబ్బంది పర్యవేక్షించారు.

ముంపునీటి తొలగింపు పనులు

మచిలీపట్నంటౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన ముంపు నీటిని తొలగించే పనులను నగరపాలక సంస్థ చేపట్టింది. ముంపునీటి కారణంగా దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులు చేయడంతో నీటిని తోడించే పనులు ప్రారంభించారు. 45వ డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం, సబ్‌జైలు, రూరల్ పోలీస్‌స్టేషన్, ఎలక్ట్రికల్ కార్యాలయం, డ్వామా తదితర కార్యాలయ సముదాయ ప్రాంతాల్లోని పల్లపు స్థలాల్లో నీళ్లు పెద్ద ఎత్తున నిలిచాయి. వాటిని ఇంజిన్లతో తోడిస్తున్నారు.

వైద్యం కోసం ఎదురుచూపులు

- నమ్మె బాటలో వైద్యులు
- ఓపీ సేవలు లేవు
- స్టాఫ్ నర్సులే దిక్కు



పెడన పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సులతో సిలైన్ బాటిల్స్ పెట్టించుకుంటున్న జ్వరపీడితులు

రావివారిపాలెం(మోపిదేవి): వైద్యం కోసం గ్రామీణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. వారికి ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికే పరుగులు పెట్టేది. మూడు రోజులుగా వైద్యులు ఆస్పత్రికి రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక స్తోమతలేని పేదలు కార్పొరేట్ ఆస్పత్రికి ఎలా వెళ్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పీహెచ్‌సీల్లో వైద్యం చేయించుకునేందుకు నడుచుకుంటూ వచ్చామని, ఇక్కడ వైద్యులు లేరని చెప్పడంతో ఏమి చేయాలో తెలియడం లేదని విచారం వ్యక్తంచేశారు. వివాదాస్పదమైన జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 14వ తేదీ నుంచి ఓపీ సేవలు నిలిపివేశారు. అప్పటి నుంచి కేవలం అత్యవసర సేవలు మాత్రమే కొనసాగించారు. ఈ మూడు రోజులుగా వాటిని కూడా నిలిపివేయడంతో పేదలు మరింత ఆందోళన చెందుతున్నారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి ప్రభుత్వ వైద్యులుగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు ఇన్ సర్వీస్ కోటా కింద క్లినికల్ సీట్లలో 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 50 శాతం వరకు రిజర్వేషన్ విధానాన్ని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇన్‌సర్వీస్ పీజీ సీట్ల కేటాయింపులో కోతలు విధిస్తూ క్లినికల్‌లో 15 శాతం, నాన్ క్లినికల్‌లో 30 శాతానికి తగ్గిస్తూ జీవో నంబర్ 85 విడుదల చేయడంపై పీహెచ్‌సీ వైద్యులు ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి నిరసనగా ఈ నెల 10 నుంచి అంచలంచెలుగా నిరసనలు చేస్తూ 16వ తేదీ నుంచి జీవో నంబర్ 85 రద్దు అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెడనలో ..

పెడన: పట్టణంలో విషజ్వరాలు తీవ్రమవుతున్నాయి. ఇటు అర్బన్ హెల్త్ సెంటర్‌కు, అటు పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. నాలుగు రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యులు సమ్మె బాట పట్టడంతో ఆయా పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులే రోగులను పరీక్షించి మందులను ఇస్తూ సిలైన్ బాటిల్స్ పెడుతున్నారు. పెడన పీహెచ్‌సీలో మూడు రోజులుగా ఓపీ రోజుకు వందకుపైగా చేరుతుంది. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులు రాస్తే వాటిని ఫార్మసిస్టు మందులను ఇస్తే ఇంజక్షన్ లేదా సిలైన్ బాటిల్ పెట్టడం వంటివి స్టాఫ్ నర్సు విధులు. ప్రస్తుతం ఫార్మసిస్టు విధులు మినహా మిగిలిన అన్ని డ్యూటీలను స్టాఫ్ నర్సులే చేసుకుంటున్నారు. షిఫ్టుల ప్రకారం స్టాఫ్‌నర్సులు విధులకు హాజరవుతూ రోగులకు సేవలను అందిస్తున్నారు.



మోపిదేవి పీహెచ్‌సీలో ఓపీనకు వచ్చిన రోగులు



ఖాళీగా కనిపిస్తున్న పెడన పీహెచ్‌సీ వైద్యుని సీటు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

పెడన: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. స్థానిక భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టిన నేపథ్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, హెచ్ఎం రూపాదేవి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో..

సంగమేశ్వరం(నాగాయలంక): స్వచ్ఛతాహి సేవలో భాగంగా మండలంలోని సముద్ర తీరగ్రామం సంగమేశ్వరం పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులతో అధికారులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక తుపాను రక్షిత భవనంలో సర్పంచి నాయుడు నాగమల్లీశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగాయలంక ఎంపీడీఓ జె.కె. సీతారామ్ కుమార్, విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ నేతృత్వంలో మహిళలు, గ్రామస్తులతో సదస్సు జరిపారు. గ్రామ కార్యదర్శి నల్లూరి సాయికృష్ణ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

● **మోపిదేవి:** మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వరస్వామివారి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. స్వామివార్ల పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత ప్రధాన దేవస్థానం కోనేరు(చెరువు) ప్రాంతంలోఅధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా చీపుర్లతో శుభ్రం చేశారు. సూపరిటెండెంట్ బసత్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న పెడన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు



ర్యాలీలో మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు కోరారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛతాహీ సేవా - 2024 అనే అంశంపై అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం వస్తుందని ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అన్నారు. ఘంటసాల సచివాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవ మూడో రోజు గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఈవో జయలక్ష్మి, సచివాలయాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం(చిలకలపూడి): ఇంటింటికీ తిరిగి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్.. ఎంపీడీవోలు, విద్యుత్‌శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం అమలులో భాగంగా గృహాలు ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరు షాపులు, ఎలక్ట్రికల్ వస్తువుల అమ్మకం దుకాణాల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాలని ఇందుకోసం కరపత్రాలు ముద్రించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను వ్యర్థాలను సేకరించి ఈ నెల 27వ తేదీకి జిల్లా కేంద్రానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఈడీ, సీఎఫ్ఎల్ బల్బులు, ట్యూబ్ లైట్లు, బ్యాటరీలు మినహాయించాలన్నారు. వాటిని ప్రత్యేకంగా సేకరించి తరలించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తైన నేపథ్యంలో రేపటి నుంచి వారం రోజుల పాటు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు, కరపత్రాలను ప్రజలకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో డీపీవో నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఇసుకమేట తొలగించడానికి అనుమతి ఇప్పించండి

ఆదిఆంధ్ర ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ఘంటసాల: లంక భూముల్లో ఇసుక మేట తొలగించుకునేందుకు అనుమతి ఇప్పించాలంటూ ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన ఆదిఆంధ్ర ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు.. తహసీల్దార్ బి.విజయప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ పరిధిలో ఉన్న కృష్ణా పరీవాహక ప్రాంతంలోని లంక భూముల్లో తెలుగురావుపాలెంలోని 160 మంది సొసైటీ సభ్యులు కంద, పసుపు, మొక్కజొన్న, మినుము, కాయగూరలు, తదితర పంటలు పండించుకుంటున్నామన్నారు. ఇటీవల వచ్చిన కృష్ణా వరదల కారణంగా లంక భూములు కోతకు గురికావడంతో పాటు ఆయా పంట భూముల్లో ఇసుక మేట వేసిందని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ఇసుక మేట తీయడానికి అనుమతి ఇప్పించాలని తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చామన్నారు. మేము పండిస్తున్న లంక భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్ చేశారని, నష్ట పోయిన పంటలకు ఈ - క్రాప్ చేసి ఆయా రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని అర్జీలో కోరినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, సొసైటీ ప్రెసిడెంట్ ఆరుంబాక రవి, సభ్యులు జె.కోటేశ్వరరావు, పి.దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, సొసైటీ సభ్యులు

రాహుల్‌పై వ్యాఖ్యలకు నిరసన

మచిలీపట్నంటౌన్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై శివసేన షిండే వర్గం శాసనసభ్యుడు సంజయ్ గైక్వాడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శించారు. స్థానిక చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు గొల్లు కృష్ణ మాట్లాడుతూ ఇతర నేతలు అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ముప్వా మోహనరావు, మచిలీపట్నం, పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు అబ్దుల్‌మతీన్, వెలశిల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, రెడ్ రిబ్బన్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వంగర శేషగిరిరావు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. డీఆర్‌పీబీసీ ఫార్ములాని ఉపయోగించి సీపీఆర్ చేయాలని సూచించారు. మరణం చేరువలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ ద్వారా పునర్జన్మ ఇవ్వవచ్చని చెప్పారు. విద్యార్థులతో సీపీఆర్ చేయించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, రెడ్‌రిబ్బన్ కోఆర్డినేటర్ వీరకుమారి పర్యవేక్షించారు.

చేనేత కార్మికులు సభ్యత్వానికి దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం(చిలకలపూడి): చేనేత కార్మికులు సహకార సంఘంలో దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ అధికారి కె.అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సహకార సంఘాల్లో సభ్యత్వం లేని సొంత మగ్గం కలిగి ఉండి చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్న ప్రతి ఒక్కరూ చేనేత సహకార సంఘాల్లో తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

ఆరు బైకుల స్వాధీనం

కోడూరు: పేకాట శిబిరంపై కోడూరు పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఎస్ఐ శిరీష గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోటుమీద శివారులో ఉన్న దిబ్బల వద్ద పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారం రావడంతో దాడులు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఆరేవరపు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. నిందితుడిని విచారణ చేయగా మందపాకల గ్రామానికి చెందిన అద్దంకి రవికృష్ణప్రసాద్ శిబిరాన్ని నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పాడని తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి పేకాట శిబిరంలో పాల్గొన్న అద్దంకి రవికృష్ణప్రసాద్, ఆరేవరపు శ్రీనివాసరావు, గంజాల సుబ్రహ్మణ్యం, పొందాల పరబ్రహ్మ శ్రీనివాస్, చందు వెంకటేశ్వరరావు, కుంభ సుబ్బారావు, పులివర్తి బాబు, బొప్పన రమణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. వీరితో పాటు ఘటనా స్థలంలో ఉన్న ఆరు బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, రేపల్లె మండలాలకు చెందిన పందెంరాయుళ్లు పేకాట కోసం ఈ ప్రాంతానికి వస్తున్నారని, శిబిరాలు నిర్వహించినా, జూదం ఆడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

గెస్ట్ లెక్చరర్‌గా దరఖాస్తు చేసుకోండి

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గెస్ట్ లెక్చరర్(అతిథి అధ్యాపకుని)గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో 50 శాతం మార్కులతో ఎంఏ ఇంగ్లిష్ సబ్జెక్టులో పట్టభద్రులైన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ 4 గంటలలోపు పూర్తి ధ్రువపత్రాలతో కాలేజీ పని వేళల్లో దరఖాస్తు చేయాలని ఆమె కోరారు. ఈ నెల 23వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలో ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు.

'స్వర్ణాంధ్రప్రదేశ్ 2045' తయారు చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వర్ణాంధ్రప్రదేశ్ 2045 డాక్యుమెంటరీని తయారుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ పాల్గొన్నారు. ఐదేళ్లు జిల్లా ఏ విధంగా ఉండాలో ప్రణాళికను తయారుచేయాలన్నారు. ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, అటవీ, పశుపోషణ, ఆక్వా కల్చర్, కోళ్ల పెంపకం, మైనింగ్ తదితర రంగాల్లో డాక్యుమెంట్లు తయారుచేయాలని సూచించారు. వీసీలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, సీపీవో గణేష్‌కృష్ణ, జెడ్పీ సీతవో ఆనందకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, పశుసంవర్ధకశాఖాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలను తొలగించండి

బందరు కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని కుమ్మరిగూడెం ప్రాంతంలోని ఆర్ఎస్ నంబరు 180, 181లో మడుగు పోరంబోకు ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి షెడ్లు, నివాసాలు ఏర్పాటు చేశారని వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ స్థలంలోని నివాసాలు, షెడ్లు వాటిలోని సామానును ఆక్రమణదారులే స్వచ్ఛందగా తొలగించి స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. పలుమార్లు హెచ్చరించినా ఆక్రమణదారులు షెడ్లు, నివాసాలను తొలగించడం లేదని లేకపోతే తామే వాటిని తొలగిస్తామని తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి పీఎంఎంఎస్‌వై నిధులు

అవనిగడ్డ: వరదలు, తుఫాన్‌లో నష్టపోయిన మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక మత్స్యకారుల సంక్షేమ భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 డిసెంబర్ నాటికి పీఎంఎంఎస్‌వై నిధులు వెనక్కి తీసుకునే అవకాశం ఉన్నందున మత్స్యకారులకు వలలు, ఐస్ బాక్సులు, మోటార్ వెహికల్స్ వంటి పథకాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

కార్తికేయుడి సన్నిధిలో పీఆర్కే ప్రత్యేక పూజలు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచెర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆయనతో అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), మోపిదేవి మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ లింగం జగదీష్ కుమార్, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో స్వామివారిని దర్శించుకున్న రామకృష్ణారెడ్డితో వైఎస్సార్ సీపీ నేతలు

కృష్ణమ్మ ఒడిలో లంక గణపతి నిమజ్జనం



నాగాయలంక వద్ద కృష్ణా నదిలో వినాయక నిమజ్జన దృశ్యం



అర్తమూరు గణపతి పూజల్లో ఎమ్మెల్యే కాగిత

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 13రోజులుగా జరుగుతున్న 67వ వార్షిక వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి వసంతోత్సవం, నిమజ్జనం కార్యక్రమాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత పందిరిలోని వేదికపై ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో వసంతోత్సవ పూజలు చేసి మేళతాళాలతో వసంతం, నిమజ్జన యాత్రకు తరలించారు. 10 అడుగుల భారీ వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. గణపతి బప్పామోరియా నినాదాలు, డప్పు కళాకారుల నృత్య విన్యాసాలు, యువకలు, బాలల డ్యాన్సులతో గణేశుని నిమజ్జన యాత్ర సాగింది. తొలుత కమిటీ చైర్మన మండవ బాలవర్ధిరావు, శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు ఉత్సవ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు జరిపారు. వినాయక విగ్రహాన్ని శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక పడవలపై కృష్ణానది మధ్యలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, తలశిల నరసింహారావు (తాతయ్య), గోలి సత్యనారాణ, విస్సంశెట్టి రాము, గడ్డిపాటి ప్రసాద్, చిట్టా హరేకృష్ణ-వాణి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలో గురువారం జరిగిన గణపతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించారు.

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద కోడూరుకు చెందిన చిట్టిప్రోలు శ్రీనివాసరావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సిద్ధి బుద్ధి సమేత గణనాథుడి కల్యాణాన్ని జరిపారు. లింగారెడ్డిపాలెం గ్రామంలో సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గా-దామోదరరావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపారు. కోడూరు తూర్పువైపు, ఇస్మాయిల్‌బేగ్‌పేట, స్వతంత్రపురం గ్రామాల్లో లంబోదరుడి విగ్రహాలను డప్పువాయిద్యాలు, డీజే పాటల నడుమ నిమజ్జనానికి తరలించారు.

కలెక్టరేట్ వద్ద అన్నదానం

మచిలీపట్నంటౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద మీడియా మిత్రులు ఏర్పాటు చేసిన ఉత్సవ పందిరి వద్ద గురువారం అన్నదానం చేశారు. శ్రీ సత్యసాయిబాబా సేవా సమాజం ప్రతినిధులు వడ్డన కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించారు.

పాల ఉత్పత్తిదారులకు అండగా మిల్క్‌యూనియన్

ఘంటసాల: పాల ఉత్పత్తిదారులకు కృష్ణా మిల్క్ యూనియన్ అండగా ఉంటుందని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ అన్నారు. స్థానిక పాలకేంద్రంలో పాలు పోస్తున్న దిండిగల శ్రీనివాసరావు ఇటీవల మరణించారు. దీంతో క్షీరబంధు పథకం ద్వారా మృతుని భార్యకు రూ.50 వేల సాయాన్ని గురువారం పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి, వెంకటరమణ, మాజీ అధ్యక్షులు గొర్రెపాటి వెంకట నరసింహారావు అందజేశారు. పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ కృష్ణ గోపీనాథ్, సంఘ సభ్యులు రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ల పరిశీలన

పెడన: పట్టణంలోని హౌసింగ్ లే అవుట్లను మున్సిపల్ కమిషనర్ గోపాలరావు సిబ్బందితో పాటు హౌసింగ్ ఏఈ సత్యనారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. పైడమ్మ లే అవుట్, పల్లోటి-1, 2లను పరిశీలించారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఇటీవల భారీ వర్షాలకు ముంపులో ఏమైనా ఉన్నాయా లేదా పరిశీలించి నివేదిక ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇంటి నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా ఉంటే లబ్ధిదారులతో పనులు ప్రారంభించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. టీపీవో ఏసుబాబు, మున్సిపల్ ఏఈ ఆంజనేయులు, సచివాలయ ఎమినిటీలున్నారు.